

జనగామ కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న ఆటో, కారు డ్రైవర్స్

# మేం బతికేదెట్ల..?

- మహాలక్ష్మి పథకంతో మా జీవితాలు ఆగం
- మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణంతో ఉపాధి కోల్పోతున్నాం
- ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి
- జనగామ, మహబూబాబాద్‌లో ఆటోడ్రైవర్ల నిరసనలు

మహబూబాబాద్ రూరల్/జనగామ చౌరస్తా, డిసెంబర్ 18 : రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మహాలక్ష్మి పథకంతో తమ జీవితాలు ఆగమవుతున్నాయని ఆటోడ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మహబూబాబాద్, జనగామలో వారు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. జనగామ అదనపు కలెక్టర్ పర్మర్ పింకేశ్ కుమార్ లలిత్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లాల అధ్యక్షులు నలమాస సాయి, జేరు పోతుల కుమార్ మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లోనే మహిళలు వెళ్తుండడంతో ఆటోలు ఖాళీగా ఉంటున్నాయని, వాటి మీదనే ఆధారపడి జీవించే వారికి చాలా ఇబ్బంది అవుతోందన్నారు. రోజు వారీగా ఆటోలు నడువకుంటే పిల్లల స్కూల్ ఫీజులు, ఫైనాన్స్‌లు వెళ్లక ఆర్థికంగా చితికిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి నెలకు రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేయాలని, పిల్లల ఫీజులు ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటోబంధు పథకం అమలు చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా ఆటోలకు ఇన్సూరెన్స్, ఫిట్నెస్ రద్దు చేయాలన్నారు. రవాణా రంగ డ్రైవర్లకు ప్ర త్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని పేర్కొ న్నారు. లేదంటే వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభు త్వానికి బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్ర మంలో ఆటో యూనియన్ నాయకులు జినక సైదులు, వీరభద్రం, శ్యాం ప్రసాద్, ఇంద్రారెడ్డి, బాలాజీ, దశరథం, ప్రతాప్, సురేశ్, వీరన్న, బాలు, యాకూబ్, ఎండీ అంజద్, విఠల్, మల్లయ్య, శ్రీనివాస్, యాదగిరి, శ్రీనివాస్, లింగమూర్తి, రవి, ఐలయ్య, లక్ష్మణ్, కారు డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభాకర్, లక్ష్మణ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

- రాజకీయాల్లో గెలుపోటములు సహజం
- బీఆర్ఎస్ శ్రేణులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం
- వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి
- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

దామెర, డిసెంబర్ 18: 'రాజకీయాల్లో గెలుపోటములు సహజం.. పార్టీ కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి. ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తాం' అని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం పరకాల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం దామెర మండల కేంద్రంలోని ఏఎన్ఆర్ గార్డెన్స్‌లో జరిగింది. నియోజకవర్గంలోని పరకాల, మున్సిపాలిటీ, నడికూడ, ఆత్మకూరు, దామెర, గీసుకొండ, జీడబ్ల్యూఎంసీ డివిజన్లు, సంగెం మండలాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి పెద్ద ఎత్తున హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన ధర్మారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం సాధించుకుని రెండు పర్యాయాలు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పాలన కొనసాగించి అనేక అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రజల తీర్పును గౌరవిస్తా.. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. అధికారంలో లేకున్నా ప్రజా సమస్యలపై పోరాడుతామన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, బీఆర్ఎస్ ఉద్యమ పార్టీ అని, పోరాటాలు కొత్త కావని అన్నారు. ఎన్నికల్లో జరిగిన నష్టాన్ని చూసి కార్యకర్తలు బాధపడవద్దని కోరారు. బీఆర్ఎస్ పార్టీకి రాజకీయాలు కొత్తకావని, వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్ర భుత్వ హయాంలో గృహలక్ష్మి పథకంలో నిర్మిం చుకునే ఇండ్లకు బిల్లులు చెల్లించాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు ఏవిధంగా జరుగుతుందో త్వరలోనే తెలుస్తుందని అన్నారు. సమావేశంలో ఎంపీపీలు కాగితాల శంకర్, మచ్చ అనసూర్యా రవీందర్, కందగట్ల నరహరి, జడ్పీటీసీలు కల్పన, మొగిలి, కార్పొరేటర్లు శివ, గిద్దె బాబు, మనోహర్, వైస్ ఎంపీపీ జాకీర్ అలీ, సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దొంగల రమేశ్, బొల్లు రాజు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు రామకృష్ణ, చందు, రాజుకుమార్, కందగట్ల నరహరి, చంద్రమౌళి, లేతాకుల సంజీవరెడ్డి, ముదిగొండ కృష్ణ, మడికొండ శ్రీను, సోదా రామకృష్ణ, కృపాకర్‌రెడ్డి, దాడి రమేశ్, మల్లయ్య, హింగె శ్రీనివాస్ పాల్గొన్నారు.



మంత్రి సీతక్కకు ప్రసాద్ ప్రాజెక్ట్ గురించి వివరిస్తున్న ఏఈ విజయ్, అధికారులు

# యువతకు ఉపాధి చూపిస్తాం

- వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తాం
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క
- ములుగులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- రామప్ప ఆలయంలో 'ప్రసాద్' ప్రాజెక్టు పనుల పరిశీలన

ములుగు రూరల్/వెంకటాపూర్, డిసెంబర్18: యువతకు ఉపాధి మార్గాలను చూపుతూ ప్రజలకు భరోసా కల్పించేలా పాలన కొనసాగిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ములుగులో సఖీ కేంద్రం ప్రాంగణంలో రూ. కోటీ 34లక్షలతో నిర్మించనున్న బాలసదనం భవనానికి ఆమె శంకుస్థాపన చేశారు. అనంతరం ములుగు ప్రభుత్వ దవాఖానలో వైద్య పరికరాలను ప్రారంభించి మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమకూర్చిన ఉపకరణాలను భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్‌రావుతో కలిసి దివ్యాంగులకు అందించారు. అదేవిధంగా స్పోర్ట్స్ సైకిళ్లను క్రీడావిద్యార్థులకు అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జన్య ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన రూ.35లక్షల విలువైన సైన్స్‌ఫేర్ కిట్లను ఉపాధ్యాయులకు అందించారు. అదేవిధంగా పాలంపేటలోని రామప్ప ఆలయాన్ని మంత్రి సందర్శించగా, అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. గ్రామ శివారులో ప్రసాద్ పథకంలో సైట్ ఏలో నిర్మాణం జరుగుతున్న ఇంటర్‌ప్రెటేషన్ సెంటర్, ఫుడ్ కోర్టు, సావనీర్ స్టాల్స్, టాయిలెట్ బ్లాక్స్, ఫౌంటేన్, కంపౌండ్ వాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ములుగు నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా నిలిపేందుకు పటిష్ట చర్యలు తీసుకొని వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీలను అమలు చేసేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలని తెలిపారు. ములుగు జిల్లాలో ఇంజినీరింగ్, బీఈడీ కళాశాలల స్థాపనకు తన వంతు కృషి చేయనున్నట్లు వివరించారు. వనదేవతల సాక్షిగా ములుగు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని చెప్పారు. ప్రత్యేక నిధుల ద్వారా రామప్ప ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. నిర్మించిన పునాది నాణ్యంగా ఉండాలని, పర్యాటకుల కోసం అధునాతన రీతిలో అన్ని విధాలా సౌకర్యాలు ఉండేటట్లు జూన్ లోపు పూర్తయ్యేలా కార్యాచరణ చేయాలన్నారు. పాలంపేట శివారులో జర్నలిస్టులు ప్రభుత్వ భూమిలో రేకులతో ఇంటి నిర్మాణాలు చేపట్టి శాంతియుత దీక్ష చేస్తుండగా మంత్రి వారికి మద్దతు ప్రకటించి, ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెకర్లు శ్రీజ, వేణుగోపాల్, అర్చకులు హరీశ్‌శర్మ, ఉమా శంకర్, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్, ఈవో శ్రీనివాస్, టీఎస్‌టీడీసీ ఏఈ విజయ్, ఆర్డీవో కే సత్యపాల్‌రెడ్డి, డీటీవో శివాజీ, డీఎస్పీ రవీందర్, డీఎంహెచ్‌ఓ అప్పయ్య, డీపీఓ వెంకయ్య, డీడబ్ల్యూఓ ప్రేమలత, దవాఖాన సూపరింటెండెంట్ జగదీశ్వర్, డీఈఓ పాణిని, వైద్యులు పూజారి రఘు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, నాయకులు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, చింతనిప్పుల భిక్షపతి, కుతుబుద్దీన్, అహ్మద్‌పాషా, బాదం ప్రవీణ్, సీఐ రంజిత్, ఎస్సై చల్లా రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సూర్యనారాయణ, మల్లాడి రాంరెడ్డి, భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్, జనగాం నాగరాజు, తడండ్ల గోపాల్, కోలకాని నర్సయ్య, ఆక కుమార్, మార్కండేయ, జయశంకర్ పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

- రానున్న స్థానిక సంస్థలకు ఇప్పటి నుంచే సంసిద్ధంగాఉండాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

మడికొండ, డిసెంబర్ 18: పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. మడికొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ధర్మసాగర్, వేలేరు మండలాల బీఆర్ఎస్ శ్రేణుల విస్తృతస్థాయి సమావేశం సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా కడియం హాజరై మాట్లాడారు. శాసనసభ ఎన్నికల్లో ధర్మసాగర్, వేలేరు మండలాల్లో తక్కువ మెజార్టీ వచ్చిన బూత్‌లలో పార్టీని పటిష్టం చేసేందుకు చొరవ తీసుకోవాలన్నారు. ఎన్నికల్లో తనకు సహకరించిన ప్రతి కార్యకర్తకు, నాయకుడికి కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు ఇప్పటినుంచే సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు, ఇతర అంశాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. సమావేశంలో కడియం ఫౌండేషన్ చైర్మన్ కావ్య, 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, ధర్మసాగర్, వేలేరు జడ్పీటీసీలు డాక్టర్ పిట్టల శ్రీలత, చాడ సరితారెడ్డి, ఎంపీపీలు నిమ్మ కవి త, కేసిరెడ్డి సమ్మిరెడ్డి, డీసీసీ డైరెక్టర్ గుండ్రెడ్డి రా జేశ్వర్‌రెడ్డి, ధర్మసాగర్, వేలేరు మండల పార్టీ అధ్యక్షులు మునిగెల రాజు, మరిజె నర్సింగ్, కుడా డైరెక్టర్ బిల్ల యాదగిరి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కాగిత మాధవరెడ్డి, నాయకులు గుజ్జుల రామ్ గోపాల్‌రెడ్డి, విజయపురి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

# సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చా..

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ రూరల్, డిసెంబర్18: పేదలకు సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, సంపాదించుకోవడానికి రాలేదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని వడ్లకొండ గ్రామంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేశారన్నారు. 130గ్రామాలకు 120 గ్రామాల్లో తనకు స్పష్టమైన మెజార్టీ వచ్చిందన్నారు. కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకుంటానన్నారు. తన ఎమ్మెల్యే జీతం పేద ప్రజల అవసరాలకు ఉపయోగిస్తానన్నారు. ఇక్కడే ఇల్లు కట్టుకోవడం తప్ప ఒక్క గుంట భూమి కొనలేదని, ఎలాంటి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయనని తెలిపారు. ప్రతి పేదవాడికి పైసా ఖర్చు లేకుండా వైద్యం అందిస్తానని, ఇప్పటికే రూ. 60 లక్షల విలువ చేసే వైద్యం అందించానని, ప్రస్తుతం 30 మంది నీలిమ దవాఖానలో వైద్యం పొందుతున్నారని తెలిపారు. గవర్నర్ ప్రసంగం పూర్తిగా అసత్యాలు, అభూత కల్పనలతో ఉన్నదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సృష్టించిన ఆస్తుల వివరాలను చెప్పకుండా, కేవలం అప్పుల గురించే కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. ఆ సాకుతో ఆరు గ్యారెంటీల అమలును అటకెక్కించాలని చూస్తోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి భాష ఎంత దుర్మార్గంగా ఉందో ప్రజలు గుర్తించాలన్నారు. తన మీద కూడా సోషల్ మీడియాలో అసత్యాలు ట్రోల్ చేస్తున్నారని, కంఠంలో ప్రాణం ఉన్నంత వరకూ బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటానని, రాజకీయాల్లో ఉన్నంత వరకు కేసీఆర్ తోనే ఉంటానన్నారు.